క్లుప్తంగా

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చన్నారు. ప్రాధాన్యక్రమంలో ఆయా అర్జీలను పరిష్కరిస్తామని వివరించారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

నందిగామటౌన్: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ వైవీఎల్ నాయుడు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. ముఖ్యంగా సత్ప్రవర్తనతో నడుచుకునే వారిని గుర్తించి వారిపై ఉన్న రౌడీషీట్‌ను తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద మందుల పంపిణీ

నందిగామరూరల్: దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు ఆయుర్వేద వైద్యంతో నయం చేయవచ్చని ఆయుర్వేద వైద్యుడు కృష్ణమోహన్ పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడులో ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్యంపై ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు ఉమ్మినేని విక్రమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీవాసవి సేవాసమితి సేవలు స్ఫూర్తిదాయకం



జగ్గయ్యపేటఅర్బన్: శ్రీవాసవి సేవాసమితి వారు పేదలకు అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని జేఆర్‌సీ కళాశాలలో ఆదివారం శ్రీవాసవి సేవాసమితి ఆధ్వర్యంలో విజయవాడ పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజానికి వాసవి సేవా సమితి లాంటి సంస్థలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ కట్టా నరసింహారావు, కౌన్సిలర్లు రామలక్ష్మి, సైదేశ్వరరావు, సేవాసమితి సభ్యులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన విద్యార్థులు

విజయవాడ స్పోర్ట్స్: కరాటే క్యూ లెవల్ బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్‌ఎఫ్ డోజో, ఏఐఎంఈఈ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. విజయవాడ శివారు కొండపావులూరులోని ఎన్‌డీఆర్‌ఎఫ్ క్యాంపులో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఈ పరీక్షను నిర్వహించింది. ఈ పరీక్షల్లో ఎన్‌డీఆర్‌ఎఫ్ డోజో విద్యార్థులు హర్షిత్‌సింగ్, ఆరిషాఇస్లాం జూనియర్ రెడ్ బెల్ట్, గురుహర్షిణి ఆరెంజ్ బెల్ట్, వెంకటధావన్, హిమబిందు, బ్రహ్మతేజ్ గ్రీన్ బెల్ట్ సాధించగా ఎండీ ఆయాన్ జపాన్ బ్రౌన్ డిప్లొమో సాధించారు. ఏఐఎంఈఈ స్కూల్ విద్యార్థులు భువాన్ష్, జితార్థ్ జూనియర్ రెడ్ బెల్ట్, ప్రన్విత ఆరెంజ్ బెల్ట్, చయాంక్ ప్రద్యుమ్న బ్లూ బెల్ట్, ఆషిష్, స్నేహ జపాన్ బ్రౌన్ డిప్లొమో సాధించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎన్‌డీఆర్‌ఎఫ్ డెప్యూటీ కమాండెంట్ దిల్‌బాగ్ సింగ్, జపాన్ కరాటే అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, ఇన్‌స్ట్రక్టర్ సాగరిక, ప్రకాశం జిల్లా ఇన్‌స్ట్రక్టర్ ప్రదీప్‌కుమార్ సర్టిఫికెట్లను అందజేశారు.

దివ్యాంగుల సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: దివ్యాంగులను సమాజంలో భాగస్వాములను చేయాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. సురభి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై ఆదివారం దివ్యాంగుల సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగుల్లో అంత్యంత ప్రతిభావంతులు ఉన్నారని, వారి సేవలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ దివ్యాంగులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని కోరారు. సురభి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంస్థ ద్వారా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. గాయనీ గాయకులు సినీ గీతాలను మధురంగా ఆలపించారు.

మినరల్ కాదు.. బోరు వాటరే!

- నాణ్యతా ప్రమాణాలకు పాతర
- ఐఎస్ఐ ముద్ర లేకుండా సాగుతున్న నీటివ్యాపారం
- ప్రజారోగ్యంతో చెలగాటం
- పట్టించుకోని ఆహార, కల్తీ నిరోధక శాఖ



కంచికచర్లలో లేబులింగ్ కూడా లేకుండా సాగుతున్న మినరల్ వాటర్ అమ్మకాలు

కంచికచర్ల: నందిగామ నియోజకవర్గంలో మంచినీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. వేసవి కాలం వచ్చిందంటే ఈ వ్యాపారం మరింత ఊపందుకుంటుంది. పలువురు వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా వాటర్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. ఆయా ప్లాంట్ల యజమానులు ప్రభుత్వం నుంచి తగిన అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా నీటివ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. సాధారణ నీటినే ట్యాంకర్లతో తెచ్చి మినరల్ వాటర్ అని చెప్పి ప్రజలను బురిడీ కొట్టిస్తుండగా, జనం సైతం మినరల్ వాటరే అని నమ్మి కొనుగోలు చేసి తాగుతుండటం గమనార్హం.

జేబులు నింపుకోవడమే పరమావధి...

నందిగామ నియోజకవర్గంలో 30 మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీటి నుంచి క్యాన్లు, ప్యాకెట్లలో రూపంలో నీటిని విక్రయిస్తున్నారు. ఇక బోర్ల నీటిని నింపి మినరల్ వాటర్ పేరిట విక్రయించే ట్యాంకర్లు 100కు పైగా ఉన్నాయి. సదరు వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు తగిన నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కేవలం జేబులు నింపుకోవడమే పరమావధిగా నీటివ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఫలితంగా ఈ వ్యాపారం మూడు క్యాన్లు..ఆరు పాకెట్లు అన్నట్లుగా సాగుతూ నిర్వాహకులకు కాసులు కురిపిస్తోంది..ప్రజలను వ్యాధుల బారినపడేలా చేస్తోంది. అయితే ఈ వాటర్‌ప్లాంట్లలో నాణ్యత ప్రమాణాలు, నిబంధనలు పాటించేలా చూడాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్, ఆహార కల్తీ నిరోధకశాఖల అధికారులు

నిబంధనలు ఇవే..

ఎవరైనా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే తొలుత బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు దరఖాస్తు చేసుకోవాలి. లేదా ఐఎస్ఐ(ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూట్) ద్వారా అనుమతులు పొందాలి. బోర్ పాయింట్ నుంచి వచ్చే నీటిని ల్యాబ్‌కు పంపి అన్నిరకాల పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ఆపై అనవసర లవణాలను తీసివేసి నీరు ఆరోగ్యదాయకంగా ఉండేలా చూడాలి. అన్ని సంతృప్తికరంగా ఉంటేనే ఐఎస్ఐ సర్టిఫికెట్లను జారీచేస్తారు. ఈ ప్లాంటకు సంబంధించిన అనుమతి స్టిక్కర్ తదితరాలను మాత్రం సంబంధిత గ్రామపంచాయతీలు, మున్సిపల్ అధికారులు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియను అధికశాతం మంది వాటర్‌ప్లాంట్ల యజమానులు అసలు చేయడం లేదు. కొందరు బయో హెర్బల్ సంస్థ నుంచి తూతూ మంత్రంగా సర్టిఫికెట్లను తెచ్చుకుని ఈ వ్యాపారాన్ని సాగిస్తున్నారు. మరి కొంతమంది వాటర్‌ప్లాంట్ల యజమానులు.. ఈ నిబంధనలు పాటించకపోతే ఏమవుతుందిలే అన్నట్లుగా వ్యవహరిస్తూ ఈ నీటి వ్యాపారాన్ని కొనసాగిస్తుండటం గమనార్హం

బోర్ల నీరే క్యాన్లలో నింపి..

కొంతమంది నీటి వ్యాపారులు రక్షిత మంచినీటి బోర్ల నుంచి వచ్చే నీటిని, మరికొంతమంది వ్యవసాయ బోర్ల నుంచి వచ్చే నీటినే క్యాన్లకు నింపి ఒక్కో క్యాను(20లీటర్లు) రూ.15 నుంచి రూ.30లకు విక్రయిస్తున్నారు. ఈ వాటర్ క్యాన్లకు కనీసం లేబుళ్లు కూడా ఉండవు. ఇక వాటర్ ప్యాకెట్లు అయితే దుర్వాసన వెదజల్లుతుంటాయి. వాటర్ ప్యాకెట్లను బస్తాల్లో నింపి విక్రయిస్తున్నారు. వాటిపై మాన్యుఫ్యాక్చరింగ్, ఎక్స్‌పైరీ డేట్, ఐఎస్ఐ నిబంధనల వివరాలేవి మచ్చుకైనా కానరావు. మరికొందరు బయట ప్రాంతాల్లో తమకు ఏజెన్సీలు ఉన్నాయంటూ మామూలు నీటినే ఏదో ఓ పేరు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. నందిగామలో రోజుకు ఈ నీళ్ల వ్యాపారం రూ.3లక్షల వరకు సాగుతున్నట్లు అనధికార అంచనా. ఈ లెక్కన నియోజకవర్గంలో మొత్తం మీద రూ.6లక్షల వరకు నీటి వ్యాపారం సాగుతోందని సమాచారం. ఇలా ఇష్టారీతిన సాగుతున్న నీటి వ్యాపారం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా సాగుతున్న అనుమతులు లేని మినరల్ వాటర్‌ప్లాంట్లపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి కొనుగోలు తప్పడం లేదు...



మా గ్రామం మున్నేరు ఒడ్డునే ఉంది. అయినా వారానికి ఒక సారే తాగునీరు వస్తుంది. పంచాయతీ పాలకులు కాని, అధికారులు కాని పట్టించుకోవడం లేదు. తాగునీరు అందకపోవడం తో మినరల్ వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి నీటికి కొనుగోలు చేస్తున్నాం. అధికారంలోకి వస్తే తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్న పాలకులు కనిపించడం లేదు. రక్షిత మంచినీటి పథకం ద్వారా నీటిని రోజూ సరఫరా చేయాలి.

– ప్రత్తిపాటి దీనమ్మ, ఎస్సీకాలనీ, కీసర

నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం...

ప్రభుత్వ నిబంధనల మేరకు వాటర్‌ప్లాంట్లను నడపాలి. విచారణ చేపట్టి మినరల్ వాటర్ల ప్లాంట్లకు ఐఎస్ఐ అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని తేల్చుతాం. నిబంధనలు పాటించని వాటర్‌ప్లాంట్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్‌చేస్తాం. రక్షిత మంచినీటి పథకాల ద్వారా వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. తాగునీరు అందని గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తాం.

– నరసింహారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, కంచికచర్ల

అక్రమ కేసుల బనాయింపు తగదు

వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న బండి మల్లికార్జునరావు, పక్కన వేల్పుల ప్రశాంతి, రమేష్, ఎంపీపీ మలక్‌బషీర్

కీసర(కంచికచర్ల): ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేసే నాయకులపై కక్షసాధింపు చర్యలకు దిగి అక్రమకేసులు బనాయించడం తగదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, ప్రముఖ న్యాయవాది బండి మల్లికార్జునరావు అన్నారు. కంచికచర్ల జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి భర్త, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్‌నాయకుడు వేల్పుల రమేష్ అరెస్టుకు పోలీసులు 12గంటలకు పైగా హైడ్రామా నడిపిన వైనాన్ని ఆయన ఖండించారు. మండలంలోని కీసరలో జెడ్పీటీసీ సభ్యురాలు ప్రశాంతి నివాసంలో ఆదివారం ఉదయం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వేల్పుల రమేష్ ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నారని గుర్తుచేశారు. ఓ బాధిత మహిళకు న్యాయం చేసేందుకు రమేష్‌తో పాటు పెద్దమనుషులుగా వ్యవహరించిన వ్యక్తులపై టీడీపీ నాయకులు కుట్రపూరితంగా కేసులు నమోదు చేయించడం దారుణమన్నారు. పోలీసులపై నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఒత్తిడి తెచ్చి వేల్పుల రమేష్‌ను అరెస్ట్ చేయించేందుకు యత్నిస్తున్నారన్నారు. అరెస్ట్ పేరుతో పోలీసులు శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు రమేష్ ఇంటి వద్ద హైడ్రామా ప్రదర్శించారన్నారు. కనీసం రమేష్ కుటుంబసభ్యులను బయటకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులను అడ్డుగా పెట్టుకుని టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలను ప్రజలంతా ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో టీడీపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి



పేటలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణసారికతో జడ్జి శోభారాణి, సుందరరావు తదితరులు




నందిగామ సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా ప్రధానన్యాయమూర్తి అరుణసారిక

నందిగామటౌన్: జైలు నుంచి విడుదలైన తరువాత సత్ప్రవర్తనతో నడుచుకోవడంతోపాటు సమాజం కోసం పాటుపడాలని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ అరుణసారిక సూచించారు. స్థానిక సబ్‌జైలును ఆదివారం ఆమె తనిఖీ చేశారు. స్టోర్ రూం, ఖైదీలకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖైదీలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఖైదీలతో చర్చించి వారి సమస్యలు, వసతులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, న్యాయమూర్తులు సత్యలక్ష్మీప్రసన్న, షేక్ రియాజ్, జైలు సూపరింటెండెంట్ సీతారామారావు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


జగ్గయ్యపేట కోర్టు సందర్శన..

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట కోర్టు ప్రాంగణాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధానన్యాయమూర్తి అరుణసారిక ఆదివారం సందర్శించారు. సాధారణ తనిఖీలలో భాగంగా జగ్గయ్యపేటకు విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికకు జగ్గయ్యపేట న్యాయమూర్తి ఎం.శోభారాణి పరిపాలనా పరమైన విషయాలను తెలియజేశారు. ఈసందర్భంగా జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు దస్త్రాల దశలో ఉన్న జగ్గయ్యపేట సబ్‌కోర్టు మంజూరు విషయాన్ని వివరించారు. పెనుగంచిప్రోలు సివిల్ జ్యూరిడిక్షన్ విషయమై నివేదికను త్వరితగతిన గౌరవ హైకోర్టు వారికి అందజేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు బడే జోగింద్రకుమార్, బి.నరసింహారావు, రావూరి ప్రసాద్, శ్రీధర్, అప్పన మాధురి, ఎం.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడితోటల్లో సేద తీరారు. పెద్దసంఖ్యలో వాహనాలు రావడంతో పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

భగత్‌సింగ్ జీవితం ఆదర్శప్రాయం



నందిగామలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నందిగామరూరల్: భగత్‌సింగ్ జీవితం నేటి యువతకు ఆదర్శనీయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్ర పటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రాణత్యాగం చేసిన వీరకిశోరమన్నారు. పొగబాంబులతో దాడి చూసి బ్రిటీష్ పార్లమెంట్‌ను గడగడలాడించిన పోరాట యోధుడని కొనియాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో భగత్‌సింగ్ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. నేటి యువత భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయటంతో పాటు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గోపీనాయక్, వల్లూరు రవిశేఖర్, బాజిద్, జాన్‌సైదా, నరసింహ, బ్రహ్మం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రకాల్వ, వేపల వాగుల ప్రక్షాళనకు డిమాండ్



ఎర్రకాలువలో వ్యర్థాలను పరిశీలిస్తున్న వట్టెం మనోహర్, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ నడిబొడ్డున జనావాసాల మధ్య నుంచి ప్రవహిస్తూ గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి దోమలకు ఆవాసాలుగా ఉన్న ఎర్రకాలువ, వేపలవాగులను ప్రక్షాళన చేయాలని ఐదోవార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ డిమాండ్ చేశారు. స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆదివారం ఎర్రకాలువ, వేపలవాగులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఊరచెరువుకు నీటి సప్లై చానల్స్‌గా ఉన్న ఈ కాలువల్లో తూటుకాడ, గుర్రపుడెక్క, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి దిగువకు ప్రవహించాల్సిన మురుగు నీరంతా ఎక్కడికక్కడ నిలిచిపోతోందన్నారు. దీంతో దోమలు వృద్ధి చెంది ఈ పరిసర ప్రాంతవాసులు తరచూ డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, విషజ్వరాలు, బోధకాలు వంటి వ్యాధుల బారన పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలు అవుతున్నప్పటికీ ఈ కాల్వ, వాగు నిర్వహణకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈ విషయంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని విమర్శించారు. ఇప్పటికైనా వాగు ప్రక్షాళనకు తగిన చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకుడు బద్దూనాయక్, నాయకులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, దార్ల ప్రసన్నకుమార్, స్థానికులు పాల్గొన్నారు.

ముస్లిం వ్యతిరేక విధానాలను అడ్డుకుంటాం

హయాత్‌షరీఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): హజ్ యాత్రికులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందిస్తామన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం, దాన్ని ఎగవేసేందుకే కుట్ర పన్నిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు హయాత్ షరీఫ్ విమర్శించారు. అందులో భాగంగానే విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను కేంద్రం ద్వారా రద్దు చేయించిందన్నారు. విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని తాజ్ మసీదు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ముస్లిం మైనార్టీల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొరుగు రాష్ట్రాల్లో ఏపీకి చెందిన హాజీలు అవస్థలు పడకూడదనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టుదలతో విజయవాడలో ఎంబార్కేషన్ పాయింట్ తీసుకువచ్చారని గుర్తుచేశారు. అలాంటి సౌలభ్యాన్ని సీఎం చంద్రబాబు ఏపీ హజ్ కమిటీ చేత కేంద్రానికి లేఖ రాయించి రద్దు చేయించడం ద్వారా ముస్లిం మైనార్టీల ద్రోహిగా నిలిచారంటూ మండిపడ్డారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ముస్లింల ప్రయోజనాలను కాపాడటంలో ఘోరంగా విఫలమయ్యిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యతిరేకించగా, చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలిపి ముస్లిం సమాజాన్ని మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వం ముస్లింలకు అందించిన ఎంబార్కేషన్ సదుపాయాన్ని కేంద్రం తొలగిస్తుంటే సీఎం చంద్రబాబు పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఏపీ నుంచి విమానయానశాఖ మంత్రిగా రామ్మోహన్ నాయుడు ఉన్నప్పటికీ చోద్యం చూస్తుండటం బాధాకరమన్నారు. రాష్ట్రప్రభుత్వం అవలంభిస్తున్న ఇటువంటి ముస్లిం వ్యతిరేక విధానాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్‌కె నజీర్, ఎస్‌కె ఇర్ఫాన్, రాంజానీ, సయ్యద్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. లోక కళ్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రతి ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహిస్తుంటారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్యనమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు సేవలో పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. అనంతరం ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేటఅర్బన్: పేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆదివారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి కౌన్సిలర్లంతా హాజరుకావాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ

నందిగామటౌన్: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతోపాటు స్వచ్ఛ నందిగామకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు కోరారు. పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా విధిగా చెత్తకుండీలను వినియోగించాలని ప్రజలకు సూచించారు. నగర పరిశుభ్రతకు ప్రతి ఒక్కరు తమ వంతుగా సహకారం అందించాలన్నారు. మున్సిపల్ సిబ్బంది ప్రజలకు అందుబటులో ఉండాలని ఆదేశించారు.

'కేవీఆర్ లేఖలు' పుస్తకావిష్కరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్)/విజయవాడ కల్చరల్: ప్రజల సంస్కృతి, జీవన విధానాలపై దాడి చేస్తూ పరిపాలన సాగించే ఏ ప్రభుత్వానికైనా పుట్టగతులు ఉండవని.. ముస్సోలిని, హిట్లర్ వంటి వాళ్లే మట్టి కరిచిన చరిత్ర ఉందని ఉస్మానియా ప్రొఫెసర్ కాశీం అన్నారు. గవర్నర్‌పేటలోని స్వర్ణప్యాలస్ హోటల్‌లో సాహితీవేత్త కేవీ రమణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని కేవీఆర్, శారదాంబ స్మారక కమిటీ ఆధ్వర్యంలో 'కేవీఆర్ లేఖలు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. విరసం నాయకులు చెంచయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాశీం 'సంస్కృతి – భావజాలం కేవీఆర్ దృక్పథం' అంశంపై ప్రసంగించారు. ముస్సోలిని, హిట్లర్ వంటి వారి పతనాన్ని వివరించారు. ప్రొఫెసర్ సాయిబాబా సతీమణి వసంత మాట్లాడుతూ కేవీఆర్ ప్రొఫెసర్ సాయిబాబాకు ఆదర్శమని పేర్కొన్నారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ అధ్యక్షత వహించిన సభలో కేవీఆర్ కుమార్తె డాక్టర్ వసుంధర, విరసం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కళాకారిణుల నృత్య కళార్చన



భవానీపురం(విజయవాడపశ్చిమ): సకల కళలకు ఆరాధ్య దేవత అయిన ఆది పరాశక్తి జగన్మాత శ్రీకనకదుర్గ అమ్మవారికి కళాకారిణులు కైమోడ్పులతో నృత్య కళార్చన గావించారు. ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని కళావేదికపై నిర్వహించే ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా అమ్మవారి సన్నిధిలో ఆదివారం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. విజయవాడకు చెందిన శ్రీనృత్య కళాశాల విద్యార్థినులు నృత్యాచార్య భాగవతుల శ్రీవల్లి నేతృత్వంలో పలు అంశాలకు నర్తించారు. గణపతి ప్రార్థనతో ప్రారంభించి 'జయ జయ నటరాజ' 'బ్రహ్మాంజలి', 'అయిగిరి నందిని', 'నగుమోము', 'అఖిలాండేశ్వరి' నృత్యాంశాలకు చక్కని ఆహార్యం, అభినయంతో భక్తులను అలరించి వారి హర్షధ్వానాలను అందుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు, కళాకారిణుల బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.